క్లుప్తంగా

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి



వరిలో ఆశించిన తెగుళ్లను పరిశీలిస్తున్న ఏఓ

సీతానగరం: వరిలో ఆశించిన తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా లచ్చయ్యపేట గ్రామంలో వరి చేను పంటను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం వరి చేను పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెలకువలను వివరించారు. వ్యవసాయ సహాయకులు, లచ్చయ్యపేట, గుమ్మిడివరం రైతులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో బస్ పాస్‌ల జారీ నిలిపివేత

సాలూరు: ఆర్టీసీ బస్ పాస్‌ల జారీని ఈ నెల 5, 6 తేదీల్లో నిలిపివేయనున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరావు తెలిపారు. పట్టణంలో విలేకర్లతో ఆయన గురువారం మాట్లాడారు. ప్రభుత్వం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను ఆధునికీకరణ చేస్తున్న కారణంగా అన్ని రకాల బస్ పాస్‌లను నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి యథావిధిగా పాస్‌లు జారీ చేస్తామని, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. నిర్మాణ రంగ కార్మిక నాయకులు మోహన్, యుగంధర్, సింహాచలం, సత్యనారాయణ, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

పార్వతీపురం టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం బ్రాంచ్ లియాపి యూనియన్ నాయకులు ఎల్.రామకృష్ణ మాట్లాడుతూ పాలసీదారులు బోనస్ రేటును పెంచాలని, జీఎస్టీని రద్దు చేయాలని, పాత ఇన్సురెన్స్ పాలసీల పద్ధతిని కొనసాగించాలని, కొత్త పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రుణాలపై వేసే వడ్డీని తగ్గించి, ఏజెంట్ల కమిషన్ పెంచాలని కోరారు. ధర్నాలో లియాపి నాయకులు జి.జగన్నాథం నాయుడు, ఏజెంట్లు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలంలో సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి గురువారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.



పార్వతీపురం టౌన్: కొత్తవలస దుర్గాలయంలో బాలా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు



సాలూరు: పసుపుకొమ్ములతో దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి



పార్వతీపురం టౌన్: వైకేఎం కాలనీలో బాలా త్రిపుర సుందరి అవతారంలో బంగారమ్మ తల్లి

వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా పండగ సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరూ – వాడ గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాలు ఎక్కడికక్కడే భక్తులు నెలకొల్పారు. అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి మొదలైంది. నవరాత్రి ఉత్సవాలను వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. తొలి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు దుర్గాదేవి భక్తులు భవానీ దీక్షలను పలు ఆలయాల్లో ప్రారంభించారు. – సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: వేమకోటివారి వీధిలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భవానీలు



సాలూరు: కామాక్షమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



సాలూరు: పట్టణంలో ఊరేగింపుగా తీసుకువస్తున్న అమ్మవారి విగ్రహాలు



సీతానగరం: మరిపివలసలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు



బలిజిపేట: బస్టాండు వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారు

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

పార్వతీపురం టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయని, జిల్లా వైద్యాధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతూ రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే కనీసం వైద్య పరీక్షలు కూడా నిర్వహించకుండా మందులు రాసిచ్చి ప్రైవేటు దుకాణాల్లో తీసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. గిరిజనుల ప్రాణాలంటే వైద్య సిబ్బందికి లెక్క లేదా? అని ప్రశ్నించారు. తప్పని పరిస్థితుల్లో గిరిజనులు ఆర్ఎంపీలను ఆశ్రయించి రక్త పరీక్షలు చేసి, రూ.వేలల్లో ఖర్చు చేసి, ఆర్థికంగా, ఆరోగ్యంగా చితికి పోతున్నారని తెలిపారు. వెంటనే పీహెచ్‌సీల్లో జ్వరాలకు మందులు అందుబాటులో ఉంచి, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, దోమతెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

టౌన్ ప్లానింగ్‌లో అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశం



ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాలపై తీవ్ర ఆరోపణలు వచ్చాయన్నారు. పట్టణంలో చాలామంది వద్ద డబ్బులు తీసుకున్నట్లు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయని చెప్పారు. ఆ అధికారి వల్ల ఎవరెవరు ఇబ్బంది పడ్డారో.. వారంతా ముందుకొచ్చి తెలియజేస్తే తగు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి వల్ల ఏ విధమైన నష్టం జరిగినా.. అన్యాయానికి గురైనా.. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అటువంటి బాధితులకు తగు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు



ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ నిరసన దీక్ష

పార్వతీపురం: ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని సీఐటీయూ, సీపీఎం నాయకులు వై.మన్మధరావు, ఆర్.వేణు అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బుధవారం మూడో రోజు ఉచిత ఇసుక సరఫరాపై నిరసన దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినప్పటికీ ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయకపోవడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు అధిక ధరలను వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు.

జిల్లాలో 100కిలోమీటర్లు పైగా దూరంగా ఉన్న భామిని మండలంలోని కాత్రగడ్డ వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తే పార్వతీపురం పరిసర గ్రామాలకు ఇసుక ఎలా తెచ్చుకోవాలని వారు ప్రశ్నించారు. ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటరమణ, దిలీప్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్: విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావునాయుడు గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ బెలగాం ఫీడర్‌లో ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. గుడ్ సెట్ రోడ్డు, సౌందర్య రోడ్డు, శత్రుచర్ల రియల్ ఎస్టేట్ రోడ్డు, ఎస్ఎన్‌పీ కాలనీ, రిక్షా పుల్లార్ కాలనీ, జనశక్తి కాలనీ, చర్చివీధి, వైకేఎం కాలనీ, డీఎంఎం స్కూల్ అగ్రహారం వీధి తదితర కాలనీకి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. అలాగే మండలంలోని నర్సిపురం ఫీడర్ ట్రీ కటింగ్ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నర్సిపురం, పద్మాపేరంటాలు ఏరియా, వసుంధరానగర్, సురేష్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాలూరులో..

సాలూరు: సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ గోపాలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా మక్కువతో పాటు సాలూరు మండలంలో మామిడిపల్లి, గంగన్నదొర, మావుడి, పాచిపెంట మండలంలో గురివినాయుడుపేట సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలన్నింటికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మక్కువలో...

మక్కువ: మండలంలోని మక్కువ, సాలూరు మండలం మావుడి సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఆపరేషన్ కె.గోపాలరావునాయుడు గురువారం తెలిపారు. 33కేవీ పరిధిలో ట్రీ కటింగ్, లైన్లు మరమ్మతులు పనులు జరిపించనున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

సాలూరు: ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. ఉచిత ఇసుక హామీ అమలు కాకపోవడం వలన భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణమే ఇసుక రీచ్‌లపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రహదారులను పూర్తి చేయండి..



మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు అప్పారావు, తదితరులు

సీతంపేట: అర్ధంతరంగా నిలిచిన రహదారుల పనులను పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు బి. అప్పారావు, పి. సాంబయ్య, తదితరులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ... పాలమానుగూడ, వంబరెల్లి, ముత్యాలు, ద్వారబందం గ్రామాల రహదారులు పనులు పూర్తికాలేదన్నారు. అలాగే పూతికవలస, పెదకంబ, దారబ, శంబాం గ్రామాలకు వేసిన రహదారుల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

సాలూరు పరిధిలో 13 మద్యం దుకాణాలు

సాలూరు: సాలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో 13 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నట్టు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.దాసు గురువారం తెలిపారు. సాలూరు మున్సిపాలిటీలో 5 షాపులు, సాలూరు మండలంలో 2, మక్కువ మండలంలో 3, పాచిపెంట మండలంలో 3 దుకాణాలను జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటి కోసం ఈ నెల 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 11న లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసి, 12 నుండి నూతన మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నట్టు పేర్కొన్నారు.

రెండు దరఖాస్తులు

సీతానగరం: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉన్న మద్య షాపులు నిర్వహణ కోసం గురువారం రెండు దరఖాస్తులు వచ్చాయని సీఐ పద్మావతి గురువారం తెలిపారు. సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల్లో మద్యం షాపులు ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించగా 3వ తేదీన రెండు దరఖాస్తులు వచ్చాయని తెలియపారు. సీతానగరం మండలంలోని రెండు షాపులకు సంబంధించి ఈ దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

ఎక్సైజ్ ఎస్ఐగా షరీఫ్

సీతానగరం ఎక్సైజ్ స్టేషన్‌కు ఎస్ఐగా ఎంబీ షరీఫ్ గురువారం బాధ్యతలు స్వీకరించారని సీఐ పద్మావతి తెలిపారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏడీఏ



నంద గ్రామ సమీపంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

మక్కువ: మండలంలోని నంద గ్రామానికి చెందిన పలువురు గిరిజన రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నష్టపోవడంతో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మదుసూధనరావు మాట్లాడుతూ నంద గ్రామానికి చెందిన 9మంది రైతులు 18.8ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందన్నారు. అడ్వంటా, సీపీ, గంగాకావేరి, పయనీరు కంపెనీల విత్తనాలను రైతులు సాగు చేశారని ఆయన తెలిపారు. మొక్కజొన్న పంట నష్టపోవడానికి గల కారణాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి, నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. నివేదికను జిల్లా వ్యవసాయాధికారికి సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఏడీఏతో పాటు ఏఓ బి.శ్రీనివాసరావు పంటను పరిశీలించారు.

అడుగడుగునా.. గుంతలు



సాలూరు - మక్కువ బైపాస్ రోడ్డులో ఎలక్ట్రికల్ కార్యాలయ సమీపంలో నీటితో నిండిన గుంతలు

- అధ్వానంగా సాలూరు – బాగువలస – మక్కువ రహదారి
- నిత్యం ప్రమాదాలతో ఆందోళనలో ప్రయాణికులు

సాలూరు: ఆ మార్గంలో అడుగడుగునా.. గుంతలే... అలా ప్రయాణించాలంటేనే వాహనచోదకులు హడలిపోయే పరిస్థితులు. ఎక్కడ ఎటువంటి ప్రమాదానికి గురై క్షతగాత్రులం అవుతామోనన్న ఆందోళన. అదే సాలూరు – బాగువలస – మక్కువ రహదారి. ఈ రహదారిలో ఎక్కడ పడితే అక్కడ పెద్ద గుంతలు పడి రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం పడితే చాటు గుంతల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. గాయాల పాలవుతున్నారు. ఈ మార్గంలో ఆర్టీసీ సర్వీసులను కూడా ఇటీవల కొద్ది రోజులు నిలుపుదల చేశారు. దీన్ని బట్టి ఈ మార్గం ఎంత అధ్వానంగా తయారైందో ఇట్టే అర్థమవుతుంది. తాజాగా గురువారం ఈ మార్గంలో తన వాహనంపై వెళ్తున్న ఓ వస్త్ర వ్యాపారి ఈ గుంతల్లో పడి గాయాల పాలయ్యాడు. తన వాహనంపై ఉన్న కొత్త వస్త్రాలు గుంతలో పడి నీటిలో తడిసి ముద్దయ్యాయి. ఇలా ఈ మార్గంలో ప్రతి రోజూ ఇలాంటి ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు తక్షణమే స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

వీరఘట్టం బీసీ కాలనీకి గ్రహణం

- 1984లో ఏర్పడిన బీసీ కాలనీ
- తమ ఇళ్లపై సొంత హక్కులు లేని కాలనీ వాసులు
- క్రయ,విక్రయాలకు నోచుకోని 450 మంది గృహవాసులు



వీరఘట్టం:

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అతిపెద్ద మేజరు పంచాయతీ వీరఘట్టం. ప్రస్తుతం పార్వతీపురం మన్యంలో సుమారు 20 వేల మంది జనాభా కలిగిన వీరఘట్టం మేజరు పంచాయతీలో బీసీ కాలనీ ఒక భాగం. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు హయాంలో అప్పటి వీరఘట్టం సమితి ప్రెసిడెంట్ పాలవలస రాజశేఖరం, గ్రామ పెద్ద దిబ్బ జోగులు మాస్టారు సంకల్పంతో వీరఘట్టంలో బీసీ కాలనీ ఏర్పడింది. ఇళ్లులేని నిరుపేదలైన బీసీ సామాజిక వర్గానికి ఇళ్ల స్థలాలలను కేటాయిస్తూ బీసీ కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 200 మందికి ఒకొక్కరికి 2 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తూ బీసీ కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇలా దశల వారీగా ఇళ్ల స్థలాలను కేటాయించడంతో ప్రస్తుతం బీసీ కాలనీలో సుమారు 450 మంది గృహవాసులు ఉన్నారు. బీసీ కాలనీ ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్నా తమ ఇళ్లపై సంపూర్ణ హక్కు పత్రాలు లేకపోవడంతో కాలనీ వాసులు సతమతమౌతున్నారు. ఇక్కడ ఉన్న ఇళ్లు అమ్ముదామన్నా, లేదా ఎవరి ఇళ్లైనా కొందామన్నా క్రయ, విక్రయాలకు నోచుకోక బీసీ కాలనీవాసులు సతమతమౌతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి బీసీ కాలనీ వాసులకు తమ ఇళ్లపై సంపూర్ణ హక్కులు కల్పించాలని వీరంతా కోరుతున్నారు.

బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నాం



మానాన్న పేరు మీద 2 సెంట్లు స్థలంలో 40 ఏళ్ల క్రితం ఇల్లు కట్టించి ఇచ్చారు. ఆయన కొంత కాలం క్రితం చనిపోయారు. ఈ ఇల్లు అమ్ముదామన్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వీరఘట్టంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బీసీ కాలనీ ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్లు జరగక ఇక్కడ ఇళ్ల ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి బీసీ కాలనీ వాసులకు సంపూర్ణ హక్కులు కల్పించాలి.

– బి.సాయికృష్ణ, బీసీ కాలనీ, వీరఘట్టం